విద్యార్థి నేతల అరెస్ట్..

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 18: ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్న విద్యార్థి నిరుద్యోగ కృతజ్ఞత సభను అడ్డుకునేందుకు యత్నించిన విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటా రెండు లక్షల ఉద్యోగాలని చెప్పి ఏడాదిలో కేవలం ఆరు వేల ఉద్యోగాలే ఇచ్చారని గుర్తు చేశారు. అయినా ఏ ముఖం పెట్టుకుని ఓయూలో సభ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. నిరుద్యోగ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు వేసే వరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్వీ, ఓయూ జేఏసీ నాయకులు జీడీ అనిల్, జంగయ్య, నాగరాజు, అశోక్‌యాదవ్, ప్రశాంత్, అశోక్, శ్రీను నాయక్, మిథున్, నాగేందర్, అవినాశ్, సందీప్, సాయి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఉస్మానియా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

థియేటర్స్‌లో కనీస సౌకర్యాలు లేవ్..

ముషీరాబాద్, డిసెంబర్ 18: సినిమా థియేటర్స్‌లో కనీస వసతులు లేక ప్రేక్షకులు ఇబ్బందులు పడుతున్నారని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పివైఎల్) ఆరోపించింది. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సినిమా థియేటర్స్‌లో సౌకర్యాల కల్పనపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. థియేటర్స్ యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని, రెండేసి థియేటర్స్ ఒకే ప్రాంగణంలో ఉండటం కారణంగా పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. టాయిలెట్స్ కంపుకొడుతున్నాయని, పరిశభ్రత పాటించడం లేదన్నారు. తాము సర్వే చేసిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ఎం.రవి కుమార్, బీఎస్ కృష్ణ, కిరణ్, బంగారి శ్రీనివాస్, దేవరాజ్ పాల్గొన్నారు.

27 నుంచి 46వ ఇండియన్ జాగ్రఫీ కాంగ్రెస్ సమావేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ మరో ప్రతిష్టాత్మక సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 27 నుంచి 46వ ఇండియన్ జాగ్రఫీ కాంగ్రెస్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జాగ్రఫర్స్ ఇండియా (ఎన్ఏజీఐ) సమావేశాలు జరుగనున్నాయి. ఎన్ఏజీఐ సహకారంతో ఓయూ జాగ్రఫీ విభాగం ఈ సమావేశాలు నిర్వహించనుంది. 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ ఫర్ సస్టెయినబుల్ ఎనర్జీ రిసోర్సెస్ అండ్ ఎస్‌డీజీస్: పాలసీ ఫ్రేమ్ వర్క్స్ అండ్ గ్లోబల్ ఇనీషియేటివ్స్'అనే అంశం పై నిర్వహించనున్న ఈ సమావేశాలకు కన్వీనర్‌గా జాగ్రఫీ విభాగం హెడ్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ లునావత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ వ్యవహరించనున్నారు. సమావేశాలను ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ ఆడిటోరియంలోనిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీ - హబ్‌లో ఇన్నోవేషన్ చాలెంజ్ -2024

కొండాపూర్, డిసెంబర్ 18 : రియల్ వరల్డ్ చాలెంజెస్‌ను పరిష్కరించడానికి స్టార్టప్‌లు, గ్లోబల్ కార్పొరేషన్‌లు కలిసి వచ్చినప్పుడే సమస్యలు సద్దుమనుగుతాయని టీ - హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ అన్నారు. ఇన్నోవేషన్ చాలెంజ్‌లో భాగంగా పానాసోనిక్, టీ - హబ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ చాలెంజ్ -2024లో భాగంగా ఉత్తమంగా నిలిచిన 4 స్టార్టప్‌లను బుధవారం టీ - హబ్‌లో నిర్వహించిన కార్య క్రమంలో ఎంపిక చేశారు. కార్య క్రమంలో పానాసోనిక్, టీ - హబ్, స్టార్టప్‌లకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలి

బడంగ్‌పేట, డిసెంబర్18 : హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ఎగతాళి చేసినందుకు బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాలల ఐక్య వేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిండు సభలో అంబేద్కర్‌ను ఎందుకు పదే పదే ప్రస్తావిస్తున్నారని, ఆయన ఏమైనా హిందూ దేవుడా అని మాట్లాడటం అంటే.. రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. హిందూ దేవుడిని స్మరించుకుంటే స్వర్గం దక్కుతుందని, అంబేద్కర్ పేరు ఎత్తడం ఫ్యాషన్ అయిపోయిందని అమిత్ షా ఎగతాళి చేశాడని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన మాల సంఘాలకు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని కోరారు.

ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటల్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలి

ప్రతి నెల 5వ తేదీ లోపు నివేదికను సమర్పించండి

పార్కు నిర్వహణలో ఫీడ్ బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్లకు చెల్లింపులు

సమీక్షలో కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం సమన్వయంతో డిజిటలైజ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్‌లతో కలిసి కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటలైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలని తెలిపారు. ప్రతి ట్రీ పార్కుకు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక ఐడీ ఇవ్వాలని తెలిపారు. 2వేల చదరపు గజాల కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశాలను పార్కులుగా అభివృద్ధి చేయాలన్నారు. పార్క్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ఏదైనా ఉల్లంఘనలు జరిగితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సర్కిళ్ల మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పార్కులను కనీసం నెలకు ఒకసారి సందర్శించి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లతో సమావేశాలు నిర్వహించి పార్క్ తనిఖీల నివేదిక ఫార్మాట్ ద్వారా ప్రతి నెల 5వ తేదీలోపు అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్‌కు నివేదిక సమర్పించాలని కమిషనర్ తెలిపారు.

ఫీడ్ బ్యాక్ ఆధారంగా చెల్లింపులు

పార్క్ నిర్వహణ గురించి వాకర్స్, స్టేక్ హోల్డర్స్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యుల నుంచి అభిప్రాయాన్ని తెలుసుకొని, సందర్శకుల నుంచి వచ్చిన ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్‌లకు చెల్లింపులు విడుదల చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పార్క్ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిరోధించడానికి ఒక ప్రతిపాదనను సమర్పించి, దానిని నియంత్రించే పద్ధతులు చేపట్టాలన్నారు. ఇతర శాఖల ద్వారా చెట్ల నరికివేతను సకాలంలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. అవసరమైన సాధనాలు, ఇన్ పుట్‌లను ఉపయోగించి కత్తిరింపు పద్ధతిపై స్పష్టమైన సూచనలను జారీ చేయడానికి అనుబంధ లైన్ డిపార్ట్‌మెంట్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని తెలిపారు.

సెక్యూరిటీ సేవలను వినియోగించుకోవాలి..

సెక్యూరిటీ గార్డుల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. అర్బన్ బయోడైవర్సిటీ విభాగం టికెటింగ్, ధర, రాబడి మొదలైనవాటిని పటిష్టమైన పద్ధతులు అనుసరించాలని కమిషనర్ తెలిపారు. రింగ్ ఫెన్సింగ్, ఫ్లో బ్యాక్ సిస్టమ్ కోసం మెకానిజం అభివృద్ధికి చర్యలు తీసుకుని తద్వారా పార్క్ అభివృద్ధి నిర్వహణ కోసం ఆదాయాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు. హరితనిధి కింద వచ్చిన సొమ్మును పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖకు బదులుగా జీహెచ్ఎంసీ వద్ద ఉంచవచ్చా లేదా అనేది దానిపై ఈ సమావేశంలో చర్చించారు. పావురాలకు బహిరంగ ప్రదేశాల్లో తినిపించడం వల్ల పట్టణ ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఇబ్బంది కారణంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, పశు వైద్య విభాగం సంప్రదించి బహిరంగ ప్రదేశాల్లో పావురాల దాణాను వేయకుండా మార్గాలను పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ సుభద్రదేవి, శ్రీనివాసరావు, సునంద రాణి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, విజిలెన్స్ విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్, అదనపు కమిషనర్ ఎస్టేట్, సామ్రాట్ అశోక్ , అదనపు కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, జాయింట్ కమిషనర్ ఐటీ పద్మ పాల్గొన్నారు.

నేటి నుంచి బుక్ ఫెయిర్

ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

మాట్లాడుతున్న బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్

చిక్కడపల్లి,డిసెంబర్18: నేటి నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్నట్లు బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్ తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాకూబ్ మాట్లాడుతూ... ఈ నెల 19 నుంచి 29 తేదీ వరకు జరిగే బుక్ ఫెయిర్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు 210కి పైగా ప్రచురణ కర్తలు, డిస్ట్రిబ్యూటర్లు, పుస్తకాలను ప్రదర్శిస్తారని తెలిపారు. బుక్ ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య, సభా కార్యక్రమాల వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడుబండి సాధిక్ పేర్లతో నామకరణం చేశామన్నారు. విద్యార్థులకు ప్రవేశం ఉచితమని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు, విశ్వవిద్యాలయాలకు ఆహ్వానం అందించామని చెప్పారు. గురువారం సాయంత్రం 5 గంటలకు బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ యేట డిసెంబర్‌లో పుస్తకాల జాతర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు 5 నుంచి 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్(వాసు) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, సొసైటీ సభ్యులు బాల్‌రెడ్డి, బి.శోభన్ బాబు, ఆర్.శ్రీకాంత్, యు.శ్రీనివాస్ రావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మిగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులు - అధికారులకు, స్థానికుల మధ్య వాగ్వాదం

లక్ష్మీగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 18: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో అక్రమంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్‌లు, నిర్మాణాలను బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. లక్ష్మీగూడ నుంచి వాంబే కాలనీ వరకు ఉన్న ఆక్రమణలను సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ నేతృత్వంలో ఈ కూల్చివేతలు చేపట్టారు. పోలీసుల భారీ బందోబస్తు మధ్య జేసీబీల సహాయంతో కూల్చివేశారు. కనీసం తమ సామాను తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానికులకు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో స్థానికులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని పక్కకు తప్పించి కూల్చివేతలను యథావిధిగా చేపట్టారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. సమయం ఇవ్వాలని అధికారులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కూల్చివేతలు చేపడుతున్నామని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కూల్చివేస్తాం : సర్కిల్ ఉపకమిషనర్

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్, లక్ష్మీనగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ, కొంత మంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు, షెడ్‌లను ఏర్పాటు ఏర్పాటు చేశారన్నారు. దీంతో ఈ దారి గుండా ప్రయాణించేందుకు వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు, ప్రజా అవసరాల నిమిత్తం కూల్చివేతలు చేపడుతున్నామని తెలిపారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇళయరాజాకు జరిగిన అవమానం పై ఖండన

హిమాయత్‌నగర్, డిసెంబర్18: ఇటీవల తమిళనాడులోని శ్రీ విల్లిపుత్తూరు ఆండాళ్లు ఆలయానికి దైవ దర్శనానికి వెళ్లిన సంగీత దర్శకుడు ఇళయరాజాకు అవమానం జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.సంపత్ తెలిపారు. బుధవారం హైదర్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇళయరాజా దళితుడనే నెపంతో ఆలయంలోని గర్భగుడిలోకి బ్రాహ్మణ పూజారులు అనుమతించలేదని, ఇప్పటికీ మానువాద విధానాలు అవలంభిస్తున్నారని విమర్శించారు. ఇళయరాజాపై వివక్ష చూపి కులాలు, జాతుల మధ్య వైరుధ్యాలను పెంచేలా బ్రాహ్మణ పూజారుల తీరు ఉందన్నారు. ఈ విషయంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి ఈలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, నాయకుడు ఎన్.సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలలో ఉన్న ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చిక్కడపల్లి,డిసెంబర్18: తెలంగాణ విద్యుత్ సంస్థలలో గల ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షనర్ జేఏసీ ఆధ్వర్యంలో.. ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలి, సమస్యల పరిష్కారం కోసం ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్స్‌ను వెంటనే కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ కే. ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఆర్టిజన్స్‌గా పనిస్తున్న వారందరూ కాంట్రాక్ట్ కార్మికులేనని తెలిపారు. రిటైర్డ్ అయిన ఆర్టిజన్ కార్మికులకు కేవలం రూ.40వేలు, రూ. 80వేలు మాత్రమే రిటైర్మెంట్ బెనిఫిట్ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్స్‌కు ఉన్న విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలన్నారు. ఈ ధర్నాలో జేఏసీ కన్వీనర్ ఎం.ఏ.వజీర్, కో చైర్మన్ బి.శంకర్, నాగరాజు, లింగమ్మ, చంద్రరెడ్డి, మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో వాటా కల్పించాలి

రవీంద్రభారతి,డిసెంబర్ 18: తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించి, చట్టబద్ధత కమిటీ వేసి ప్రభుత్వ పథకాల్లో వాటా కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక డిమాండ్ చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోధుమల కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, కళాకారులుగా గుర్తించి భాషా సాంస్కృతిక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉద్యమంలో పాల్గొన్న వారికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఉద్యమం సమయంలో విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి, అర్హులైన విద్యార్థులకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర మహిళా కన్వీనర్ దోనేటి కృష్ణలత, గొల్లపల్లి నాగరాజు, సింగారం రవీందర్, గోధుమల సంపత్‌కుమార్, యాకయ్య, సోమ య్య, రుద్రోజురవీన్, అంజిరెడ్డి ప్రసంగించారు. అలాగే పాలకుర్తి నియోజకవర్గ ఆడా కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సాదం రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బానోత్ రెడ్యానాయక్, సింగారం రవీందర్, మిగతా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోధుమల కుమారస్వామి, దోనేటి కృష్ణలత

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ రెడీ

ఎల్బీ నగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఐఆర్ఆర్‌పై నాలుగు కొత్త ఫ్లై ఓవర్లు

హెచ్ సిటీలో రూ.955 కోట్లతో పనులు

ప్రత్యేక ఆకర్షణగా ఒకే మార్గంలో ఫ్లై ఓవర్, మెట్రో మార్గం

త్వరలోనే పనులకు టెండర్లు..

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్లుపై కొత్తగా నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సన్నద్ధమవుతున్నది. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా ఎల్బీనగర్-ఆరాంఘర్ ప్రాంతాల మధ్య ఐఆర్ఆర్ (ఇన్నర్ రింగు రోడ్డు)పై ఆరు లేన్ల వెడల్పుతో దాదాపు రూ.955 కోట్ల వ్యయంతో మరో నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తొలిసారిగా డబుల్ డెక్కర్ విధానంలో నిర్మాణం చేయనుంది. కింద ఫ్లై ఓవర్, పైన మెట్రో మార్గం ఉండనుంది. ఈ మేరకు నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లే 36.8 కిలోమీటర్ల పొడవైన మెట్రో రైల్ మార్గంతో ఆయా ఫ్లై ఓవర్లను అనుసంధానం చేయనున్నారు. నాలుగు ఫ్లై ఓవర్లను టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రి నగర్, మందమల్లమ్మ జంక్షన్లు మీదుగా ఒకటి, ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్ హాల్ మీదుగా మరొకటి, బండ్లగూడ-ఎర్రకుంట క్రాస్‌రోడ్ జంక్షన్ మీదుగా మూడో ఫ్లై ఓవర్, మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ జంక్షన్ల మీదుగా నాలుగో ఫ్లై ఓవర్ నిర్మాణం జరగనుంది. కాగా ఎస్ఆర్‌డీపీలో భాగంగా ఇప్పటికే జీహెచ్ఎంసీ ఇప్పటికే చాంద్రాయణగుట్ట, ఒవైసీ చౌరస్తా , బైరామల్‌గూడ, ఎల్బీనగర్ కూడళ్లలో ఫ్లై ఓవర్లను నిర్మించగా, తాజాగా హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నాలుగు ఫ్లై ఓవర్ల పనులను తెరమీదకు తీసుకువచ్చింది.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్ రెడ్డి

కార్యకర్తలతో రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్ రెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలకు పాలనపై అవగాహన లేక కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు గుర్తించారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెట్టడానికి సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. రాజేంద్రనగర్ సులేమాన్ నగర్‌లో నిరుపేద ముస్లిం సోదరులు ఉన్నారని , ఉమ్మడి పాలనలో ఏ పార్టీలు ఈ ప్రాంతాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని గుర్తు చేశారు. పదేండ్లలో ఇంటింటికీ నల్లా, షాదీముబారక్, రెండు పడకల గదులు, సీసీ రోడ్లు , డ్రైనేజీ పనులు పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. అనంతరం మహ్మద్ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలను అభినందించారు. అలాగే నూతన డివిజన్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా మహ్మద్ జహీరుద్దీన్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ అమీర్, షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రెహమాన్, ఎండీ ఇబ్రహీం, ఎండీ మహబూబ్, ఎండీ మగ్బుల్, భాషతో పాటు 20 మందితో నూతన కమిటీని ప్రకటించారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి : కలెక్టర్

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. విద్యార్థులందరికి చదవడం, రాయడం తప్పనిసరిగా వచ్చి ఉండాలని ఆ మేరకు విద్యా బోధన ఉండాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలలను తనిఖీలు చేస్తూ మెరుగుదలపై సూచనలు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు పాఠశాలలను తనిఖీ చేసే కార్యక్రమాలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

22న సారంగి ఫిల్మ్ అవార్డులు ప్రదానం

సారంగి ఫిల్మ్ అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకుడు రాఘవేంద్రరావు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలుగు సినిమాల్లో ప్రతిభ చాటుతున్న నటీనటులను ప్రోత్సహించడం అభినందనీయమని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు అన్నారు. ఈ నెల 22న రవీంద్రభారతిలో సాయంత్రం 6గంటలకు జరగనున్న సారంగి ఫిల్మ్ అవార్డుల కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం రాఘవేంద్రరావు కార్యాలయంలో ఆవిష్కరించారు. సినిమా రంగానికి చెందిన పలు కేటగిరీల్లో అవార్డులను అందజేస్తున్నట్లు సారంగి అధినేత ఖాజా అఫ్రిది తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, సినీ దర్శకుడు వేణు ఉడుగుల తదితర ప్రముఖులు పాల్గొంటారని వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పల్లె సుమన్, సిల్వేస్టర్, శ్రీకాంత్, సన్నీ పాల్గొన్నారు.

నాన్ డయేరియా డీ హైడ్రేషన్ పట్ల నిర్లక్ష్యం వద్దు

కెన్‌వ్యూ అధ్యయనంలో వెల్లడి

నాన్ డయేరియా డీ హైడ్రేషన్ సమస్యలపై నివేదిక విడుదల చేస్తున్న డా.రవీందర్‌రెడ్డి, డా. శ్రీధర్

బంజారాహిల్స్, డిసెంబర్18: నాన్ డయేరియా కేసుల్లో ఏర్పడే డీ హైడ్రేషన్ సమస్యలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే అత్యంత తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, ఇటీవల ఇలాంటి కేసుల సంఖ్య ఎక్కువగా నమోదవుతోందని కెన్‌వ్యూ ఇండియా సంస్థ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా.బి. రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ' ది హైడ్రేషన్ గ్యాప్ ఫర్ నాన్ డయేరియా ఇల్‌నెస్' అనే అంశంపై నివేదికను ప్రముఖ పీడియాట్రిషియన్ డా.ఎన్ఎల్.శ్రీధర్‌తో కలిసి డా.రవీందర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా డా.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారికి ఫ్లూయిడ్స్, ఎలక్ట్రోలైట్స్, ఎనర్జీ కలిగించే ద్రవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అయితే కొంతమందిలో డయారేయా లేకున్నా విపరీతమైన నీరసం, జ్వరం, తదితర లక్షణాలతో డీ హైడ్రేషన్ ఏర్పడుతుందన్నారు. అలాంటివారిలో 45శాతం మందికి ఎలక్ట్రోలైట్స్, ఫ్లూయిడ్స్‌ను సరైన సమయంలో అందిస్తే సరిపోతుందని, తమ అధ్యయనంలో తేలిందన్నారు. నాన్ డయేరియా డీ హైడ్రేషన్ బాధితులకు ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఇవ్వవచ్చని, తద్వారా వారు కోల్పోయిన శక్తిని పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో కెన్‌వ్యూ డైరెక్టర్ నాగరాజన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆవంత్స సోమసుందర్ ఆశయాలను కొనసాగించాలి



ఆవంత్స సోమసుందర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రవీంద్రభారతి,డిసెంబర్18: ఆవంత్స సోమసుందర్ ఆశయాల స్ఫూర్తిని కొనసాగించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఆవంత్స సోమసుందర్ శతజయంతి వేడుకలు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథిగా సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, డా.కోయి కోటేశ్వర రావు తదితరులు హాజరై సోమసుందర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. ఆవంత్స సోమసుందర్ సమగ్ర సాహిత్యం గురించి చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమం ఆంధ్ర ప్రాంతంలో ప్రకంపనలు సృష్టించిందని, ఆ ప్రభావంతో కవులు కావ్యాలు రాశారన్నారు. తెలంగాణలో దాశరథి ఒక్కడే పోరాడుతున్నాడని, ఆయనకు మద్దతుగా సోమసుందర్ వజ్రాయుధాన్ని అందించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లేరు వీరస్వామి, అరసం నాయకులు వేల్పుల నారాయణ, చందనాల సుమిత్ర, కొండపల్లి నిహారిణి, కెవిఎల్ , చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.